సాక్షి 24|7
తూర్పుగోదావరి
బుధవారం 28-3-2018

# విద్యార్థి దశలో క్రీడలు ఎంతో అవసరం

## ఒలింపిక్ విజేత కరణం మల్లీశ్వరి




కరణం మల్లీశ్వరిని సత్కరిస్తున్న జేఎన్‌టీయూకే వీసీ వీఎస్ఎస్ కుమార్, రిజిస్ట్రార్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ ప్రసాద్‌రాజు, శ్యామ్‌కుమార్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థి దశలో క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఒలింపిక్ విజేత, వెయిట్ లిఫ్టర్ కరణం మల్లీశ్వరి పేర్కొన్నారు. కాకినాడలోని జేఎన్‌టీయూకేలో మంగళవారం జేఎన్‌టీయూకే క్రీడా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ జీవితంలో ఎదగడానికి చదువే ప్రామాణికం కాదని, ఆటపాటలను కూడా జీవిత పాఠంలో చేర్చుకోవాలని సూచించారు. ప్రతి మనిషిలో ఏదో ప్రతిభ దాగి ఉంటుందని, ప్రతిభకు కృషి తోడైతే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ప్రస్తుతం యువత ఇంటర్నెట్, వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి వాటికి అంకితమైపోతున్నారని, తమ శక్తియుక్తులు ఉపయోగించి క్రీడారంగానికి సాంకేతికతను జోడించి అద్భుతాలు సృష్టించాలన్నారు. జేఎన్‌టీయూకే వీసీ వీఎస్ఎస్ కుమార్ మాట్లాడుతూ క్రీడా రంగాన్ని అభివృద్ధి చేయడానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు జ్ఞాపికలను అందజేసి కరణం మల్లీశ్వరిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీఆర్ ప్రసాద్‌రాజు, స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి శ్యామ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ, డైరెక్టర్ అబ్బయ్య, ఎంఎం ప్రసాద్ పాల్గొన్నారు.

# క్రీడలకు ప్రత్యేక విధానం ఉండాలి

## పద్మశ్రీ పురస్కార గ్రహీత, వెయిట్ లిఫ్టర్ కరణం మల్లీశ్వరి



కరణం మల్లీశ్వరి

బాలాజీచెరువు (కాకినాడసిటీ): క్రీడలను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక విధానాలు తీసుకురావాలని పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రముఖ వెయిట్ లిఫ్టర్ కరణం మల్లీశ్వరి పేర్కొన్నారు. జేఎన్‌టీయూకే స్పోర్ట్స్‌డేకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమెతో 'సాక్షి'తో కొద్దిసేపు ముచ్చటించారు.

**ప్రశ్న: వెయిట్ లిఫ్టింగ్‌కు ప్రాధాన్యం తక్కువేనా?**

జవాబు: అన్ని క్రీడల ప్రాధాన్యం తక్కువగా ఉంది. ప్రత్యేకించి వెయిట్ లిఫ్టింగ్‌కు ప్రాధాన్యం తక్కువ అనేది ఏమీ లేదు.

**ప్రశ్న: వెయిట్ లిఫ్టింగ్ అకాడమీ ఏర్పాటు చేశారా?**

జవాబు: హర్యానాలో వెయిట్ లిఫ్టింగ్ శిక్షణకు అకాడమీ ఏర్పాటు చేశాను. ఎంతో మంది క్రీడాకారులకు సరైన శిక్షణతో పాటు సదుపాయాలు లేక వెనుకబడిపోతున్నారు. హైదరాబాద్‌లో గోపీచంద్ అకాడమీ ఏర్పాటుచేయడం ద్వారా పీవీ సింధులాంటి క్రీడాకారులు బయటకు వచ్చి తమ ప్రతిభను చూపారు.

**ప్రశ్న: వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఏ విధంగా ఉంది?**

జవాబు: వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు కేవలం సీఆర్‌పీఎఫ్, ఆర్మ్‌డ్ ఫోర్స్ వంటి సైనిక రంగాల్లో మాత్రమే అవకాశాలు ఉన్నాయి. మిగతా శాఖల్లో అవకాశాలు చాలా తక్కువ.

**ప్రశ్న: ఏపీ నుంచి వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ చూపినా, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన వారు లేకపోవడానికి కారణం?**

జవాబు: క్రీడాకారులకు మౌలిక సదుపాయాల కొరత ఉంది. దీంతో సరైన శిక్షణ లేక వెనకబడిపోతున్నారు. అలాగే జాతీయ స్థాయిలో ప్రతిభ చూపలేకపోవడానికి ప్రత్యేక కారణం భాష. దాంతో పాటు ఉత్తరాది రాష్ట్రాల్లో రాజకీయ ప్రమేయం ఎక్కువగా ఉండడమూ కారణమే.

**ప్రశ్న: మీరు ఇప్పటి వరకు ఎన్ని పతకాలు, పురస్కారాలు సాధించారు?**

జవాబు: 2000 సంవత్సరంలో ఒలింపిక్స్‌లో 69 కిలోల విభాగంలో కాంస్య పతకం, 1994లో ఇస్తాంబుల్ ప్రపంచ చాంపియన్ షిప్‌లో బంగారు పతకం, 1995లో కొరియాలో ఆసియా చాంపియన్ షిప్ పోటీలు. అదే ఏడాది చైనాలో 54 కిలోల విభాగంలో మూడు బంగారు పతకాలు సాధించి భారత ప్రభుత్వం తరపున అర్జున పురస్కారాన్ని అందుకున్నాను. 1995లో రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న, 1999లో పద్మశ్రీ పురస్కారం.

**ప్రశ్న: క్రీడాకారులు విలాసవంతమైన జీవితానికి అలవాటుపడి విజయాలు సాధించలేకపోతున్నారనే పలువురి వ్యాఖ్యలపై..?**

జవాబు: భారతదేశం తరపున పతకాలు రావడం లేదు, సరైన క్రీడాకారులు లేరు అంటూ ఏసీ గదుల్లో కూర్చుని మాట్లాడినంత సులభం కాదు పతకాలు సాధించడం. క్రీడాకారుడి ప్రయత్నంలో ఉన్న శ్రమ, ఆవేదన మరొక క్రీడాకారుడికి మాత్రమే తెలుస్తుంది.

**ప్రశ్న: యువ క్రీడాకారులకు మీరిచ్చే సందేశం?**

జవాబు: క్రీడాకారుడికి వ్యక్తిగత శ్రద్ధ, కఠోర శ్రమతో పాటు నమ్మకం ఉండాలి. ఈ మూడు ఉంటే విజయానికి మంచి మార్గం ఏర్పడుతుంది. వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు నా సహకారం ఎప్పుడూ ఉంటుంది. వెయిట్ లిఫ్టింగ్ అనే క్రీడకు మంచి గుర్తింపునకు ప్రభుత్వ పరంగా మంచి సహకారం ఉండాలనేది నా కోరిక.

**ప్రశ్న: తెలుగువారిగా ఉన్న మీరు ఏపీలో అకాడమీ నిర్వహణకు కృషి చేస్తున్నారా?**

జవాబు: ఏపీలో అకాడమీ నిర్వహణకు ఇప్పుడైతే ఏ విధమైన ప్రణాళికలు లేవు. ముఖ్యంగా ప్రభుత్వం తరపున ఏ విధమైన సహకారం లేదు. ఇప్పుడైతే క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి ప్రభుత్వ సర్వీస్‌తో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. నేను ఇప్పటికీ ఢిల్లీలో సొంతంగా ఉద్యోగం చేసుకుంటున్నాను.